పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

ఘట్‌కేసర్‌: ఇళ్లలోని చెత్తను బయట వేయకుండా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధానయమిచ్చి చెత్తను సేకరించే వాహనంలో వేయాలని మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య అన్నారు. స్వచ్ఛత హీ సేవా–2024లో భాగంగా పట్టణంలోని ఈడబ్ల్యూఎస్‌ కాలనీలో వైస్‌ చైర్మన్‌ మాధవరెడ్డితో కలిసి గురువారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా రోడ్లు, కాలనీ సమీపంలో చెత్త లేకుండా శుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వ్యాపార సముదాయ యజమానులు ప్లాస్టిక్‌ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. షాపుల వద్ద నిర్వాహకులు చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శశికళ, మల్లేశ్‌, రవీందర్‌, నాయకులు జంగయ్యయాదవ్‌, రాధాకృష్ణముదిరాజ్‌, వెంకటేశ్‌, ఆంజనేయులు, దేవేందర్‌ ముదిరాజ్‌, నజీర్‌ తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్‌లో శుభ్రం చేస్తున్న చైర్‌ పర్సన్‌ పావనీజంగయ్య, కౌన్సిలర్లు

వాతావరణ మార్పులపై అవగాహన


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ కళాశాల విద్యార్థులు ప్రపంచ వాతావరణ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల హిందుస్థాన్‌ స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ విద్యార్థులు కండ్లకోయ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల, మేడ్చల్‌లోని సదాశివ ఇంటర్నేషనల్‌ పాఠశాలల్లోని విద్యార్థులకు మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పులపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌ వాడకం వల్ల కలిగే అనర్థాలు... వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గూర్చి వివరించారు. అనంతరం జో గ్రీన్‌ బ్రీత్‌ క్లీన్‌ నినాదంతో పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. పర్యావరణ మార్పులను నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతా ఉండాలని కళాశాల డైరెక్టర్‌ జంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ మధుసూదన్‌రెడ్డి, స్కౌట్స్‌ కో ఆర్డినేటర్‌ ప్రవీణ్‌రెడ్డి, విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీసీబీలపై విద్యార్థులకు అవగాహన అవసరం

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్‌ కళాశాలలో ప్రింటెడ్‌ సర్క్యూట్‌ బోర్డ్‌ (పీసీబీ)లపై గురువారం వర్క్‌షాప్‌ నిర్వహించారు. వర్క్‌షాప్‌ను కళాశాల చైర్మన్‌ నర్సింహారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌ రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించగా అనంతరం విద్యార్థులకు పీసీబీల రూపకల్పన, వాటి తయారీ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎలక్ట్రానిక్స్‌ రంగంలో పీసీబీలను అర్థం చేసుకోవడం చాలా కీలకమన్నారు. ఎలక్ట్రానిక్‌ పరికరాలకు పీసీబీ వెన్నెముక వంటిదని తెలిపారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వర్క్‌షాప్‌లో ప్రిన్సిపాల్‌ లోకనాథం, డైరెక్టర్‌ మోహన్‌బాబు, ఈసీఈ హెచ్‌ఓడీ పురుషోత్తమ్‌ ప్రసాద్‌, కో ఆర్డినేటర్‌ పవిత్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి చెరువులను పరిశీలించిన హైడ్రా

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో గురువారం హైడ్రా అధికారులు పర్యటించి పలు చెరువులు, వాటిలో చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలోని నారాయణ చెరువు,సుమాల్‌ చెరువులను ఇరిగేషన్‌ , రెవెన్యూ శాఖల అధికారులతో పాటు మున్సిపల్‌ అధికారులతో కలిసి పరిశీలించిన హైడ్రా అధికారుల బృందం మున్సిపల్‌, ఇరిగేషన్‌ అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయా చెరువు విస్తీర్ణం, వాటిలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలు, ఆక్రమణలు వంటి పూర్తి వివరాలతో నివేదించాలని మున్సిపల్‌ అధికారులను ఆదేశించారు. హైడ్రా అధికారుల పర్యటన, చెరువుల పరిశీలన మున్సిపాలిటీ పరిధిలో చర్చనీయాంశంగా మారింది. త్వరలో హైడ్రా కూల్చివేతలు ఉంటాయా అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన



బోడుప్పల్‌: నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 19వ డివిజన్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. గురువారం బోడుప్పల్‌ లోటస్‌ ల్యాప్‌ పబ్లిక్‌ స్కూల్‌ విద్యార్థులు, ఉపాధ్యాయులకు పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా 13వ డివిజన్‌లో మున్సిపల్‌ అధికారులు, సిబ్బంది మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నారాయణరెడ్డి, కమలాకర్‌, హెల్త్‌ అసిస్టెంట్‌ వినోద్‌, స్వచ్ఛ భారత్‌ మిషన్‌ కో– ఆర్డినేటర్లు మల్లేష్‌, మహేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

ధీర వనిత ఐలమ్మ

- పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ
- నిజాం నిరంకుశ పాలనపై అవిశ్రాంత పోరాటం
- ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించిన నాయకులు


పోలీస్‌ శిక్షణ కళాశాలలో...

మేడ్చల్‌రూరల్‌: పోరాట స్ఫూర్తికి ప్రతీక చాకలి ఐలమ్మ అని గుండ్లపోచంపల్లి మున్సిపల్‌ రజక సంఘం అధ్యక్షుడు మలిగె అశోక్‌ అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా మినీట్యాంక్‌ బండ్‌పై ఆమె విగ్రహానికి రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు శ్రీకాంత్‌, కిశోర్‌, శివ,యాదయ్య, శంకర్‌, బాలయ్య, వినోద్‌ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌ పట్టణంలో...

మేడ్చల్‌ పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పించి ఆమె జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు.

పోలీస్‌ శిక్షణ కళాశాలలో...

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని పోలీస్‌ శిక్షణ కళాశాలలో పోలీసులు ఐలమ్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌, అడిషనల్‌ ఎస్పీ వెంకటేశ్వర్‌ బాబు, అసిస్టెంట్‌ కమాండెంట్‌ జవహర్‌, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేఆర్‌నగర్‌లో...

జవహర్‌నగర్‌: నిజాం నిరంకుశత్వంపై వీరోచిత పోరాటం చేసిన చాకలి ఐలమ్మ ధీర వనిత అని... నేటి తరం మహిళలకు ఆదర్శమని కాంగ్రెస్‌ పార్టీ జవహర్‌నగర్‌ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్‌ అన్నారు. గురువారం బీజేఆర్‌నగర్‌లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి మహిళల్లో చైతన్యం తెచ్చిన గొప్ప మహిళ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్‌ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ యూనివర్సిటీ ర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ శంకర్‌గౌడ్‌, నాగరాజు, వినయ్‌కుమార్‌, బలరాం, మహేందర్‌యాదవ్‌, బూడిద వెంకటేష్‌, ప్రసాద్‌, కె.కె.చారి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.


గుండ్లపోచంపల్లిలో రజక సంఘం నాయకులు...


బీజేఆర్‌నగర్‌లో శ్రీకాంత్‌యాదవ్‌...

ఆలోచింపజేసిన సైన్స్‌ మేళా

మేడ్చల్‌రూరల్‌: మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సైన్స్‌ మేళా సందర్శకులను ఆలోచింపజేసింది. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక అంశాలు అబ్బురపరిచాయి. అగస్త్య ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాలో విద్యార్థులు వివిధ సైన్స్‌ నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మాణిక్యాలరావు, ఫౌండేషన్‌ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతిలేని మెడికల్‌ షాప్‌ సీజ్‌

జవహర్‌నగర్‌: ఎలాంటి అనుమతులు లేకుండా మెడికల్‌ షాపులు నడిపితే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని మేడ్చల్‌ జిల్లా డ్రగ్‌ ఇన్‌స్పెక్టర్‌ శివతేజ హెచ్చరించారు. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని మల్కారంలో శ్రీ వెంకటేశ్వర మెడికల్‌ అండ్‌ జనరల్‌ స్టోర్‌ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారనే సమాచారంతో శివతేజ తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో మెడికల్‌ షాపును సీజ్‌ చేసినట్లు తెలిపారు.

పేద విద్యార్థులకు బస్‌ పాసుల పంపిణీ


ఎదులాబాద్‌ హరిజనవాడలో బస్‌ పాసులు అందజేస్తున్న కొండల్‌రెడ్డి

ఘట్‌కేసర్‌: ఎదులాబాద్‌ హరిజనవాడ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బీఆర్‌ఎస్‌ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి గురువారం ఉచితంగా ఆర్టీసీ బస్‌ పాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్టీసీ బస్‌ తీసుకొనే స్తోమత లేని పేద విద్యార్థులకు తమ సొంత డబ్బుతో బస్‌పాసులను కొని ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రవి, మాజీ సర్పంచ్‌ భిక్షపతిగౌడ్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

అల్వాల్‌: అధికారులు నిష్పక్షపాత వైఖరితో వ్యవహరించి అట్రాసిటీ కేసుల్లో దళితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పనిచేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం నేరేడ్‌మెట్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్యామ్‌ప్రకాష్‌ చైర్మన్‌గా షెడ్యూల్డ్‌ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షెడ్యూల్డ్‌ కులాల వారికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడంలో తహసీల్దార్‌ పారదర్శకత పాటించాలని తెలిపారు. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అరవ మాలలకు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌ ఇవ్వడంలో చాలా జాప్యం జరుగుతుందని, అనేక నిబంధనలు పెట్టడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంలో ఆర్డీఓ చొరవ తీసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్డీఓ శ్యామ్‌ప్రకాష్‌తోపాటు వివిధ శాఖల పోలీస్‌ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి, పోలీసులు, ఇతర అధికారులు

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం

మేడిపల్లి: పరిసరాల పరిశుభ్రతతో పాటు పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కామ్‌ ఫౌండేషన్‌ సీఈఓ, డాక్టర్‌ స్మితాసింగ్‌ అన్నారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆమె, ట్రైనర్‌ మిథున్‌కుమార్‌ పాల్గొని పారిశుద్ధ్య కార్మికులకు వర్క్‌షాప్‌ నిర్వహించారు. శానిటేషన్‌ సిబ్బంది పనిచేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్యంగా ఉండటానికి పాటించాల్సిన నియమాలు, ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలు, స్కీముల గురించి వివరించారు. కమిషనర్‌ అమర్‌సింగ్‌, కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన ..

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఐటీసీ ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థులకు ఎం కన్వెన్షన్‌హాల్‌లో తడి చెత్త, పొడి చెత్త, హానికర చెత్త సేకరణ, వేరు చేయడం, ప్లాస్టిక్‌ వాడకం తగ్గించడం, నియంత్రించడంపై అవగాహన కల్పించారు. మేయర్‌ అమర్‌సింగ్‌, కమిషనర్‌ త్రిలేశ్వర్‌రావు, 24వ డివిజన్‌ కార్పొరేటర్‌ అనంత్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్‌ ఇంజినీర్లు బాలమురళీకృష్ణ, సుధా పాల్గొన్నారు.



స్వచ్ఛ భారత్‌ కార్యక్రమంలో పాల్గొన్న స్మితా సింగ్‌

హైడ్రా ‘డర్‌’ !

- తమ ఇళ్లు కూల్చివేస్తారనే ఆందోళనలో స్థానికులు
- ప్రాణాలైనా వదిలేస్తామని, ఇళ్లు వదలమన్న నివాసితులు
- స్పష్టం చేసిన రామంతాపూర్‌ మూసీనది బఫర్‌జోన్‌ వాసులు


ఆందోళనలో రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌ వాసులు

రామంతాపూర్‌: రామంతాపూర్‌ భగాయత్‌ మూసీ పరివాహక ప్రాంతంలోని బఫర్‌జోన్‌లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు హైడ్రా తమ ఇళ్లను కూల్చివేస్తుందనే వార్తలతో స్థానికులు భయాందోళకు గురయ్యారు.

పైసా పైసా కూడగట్టుకుని.. స్థలాలు కొని..

తాము అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నామని, ఇప్పుడేమో హైడ్రా పేరిట అధికారులు వచ్చి ఇళ్లు కూలుస్తామనడం దారుణమని బఫర్‌జోన్‌ వాసులు గురువారం ఆందోళనకు దిగారు. పైసా పైసా కూడపెట్టుకున్నామని, రామంతాపూర్‌ మూసీ బఫర్‌ జోన్‌లో స్థలాలు కొని అప్పులు చేసి ఇల్లు నిర్మించుకున్నామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సుందరీకరణ పేరిట ఇళ్లను కూల్చివేస్తామనడం తగదని వారు వాపోయారు. ఈ స్థలాలను మేము కబ్జా చేయలేదని డబ్బులు పెట్టి కొన్న స్థలాలేనన్నారు.

ప్రాణత్యాగానికైనా సిద్ధం..

అధికారులు తమ ఇళ్లను కూల్చివేస్తే ప్రాణ త్యాగాలకైనా సిద్ధపడతామని కానీ ఎంతో దూరంలో ఉన్న డబుల్‌బెడ్రూమ్‌లు మేము తీసుకోవడానికి సిద్ధంగా లేమని నివాసితులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు మూసీ పరివాహక ప్రాంతాన్ని తమ ఇళ్లను వదిలేసి సుందరీకరణ చేసుకునే అవకాశం ఉందని దానిని పక్కన పెట్టి ప్రభుత్వం తమ ఇళ్లపై పడటం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించుకుని తమ ఇళ్లను వదిలేసి సుందరీకరణ చేసుకుంటే మాకు ఎవరికీ అభ్యంతరం లేదని వారు సూచిస్తున్నారు.


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్‌

పేదలకు న్యాయం చేస్తా: ఎంపీ ఈటల రాజేందర్‌

రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌ వాసులు గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ కలిసి బఫర్‌జోన్‌లోని తమ ఇళ్లను కూల్చడానికి అధికారులు సిద్ధపడుతున్నారని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందిస్తూ.. బఫర్‌జోన్‌లోని ఇళ్లను కూల్చివేయకుండా పూర్తి స్థాయిలో కృషి చేస్తానని శుక్రవారం మూసీ బఫర్‌జోన్‌ బాధితులు నిర్వహిస్తున్న సమావేశంలో తాను పాల్గొంటానని ఈటల చెప్పారు.

ఇళ్లను వదలం..



రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌లో గత 15 ఏళ్ల క్రితం అప్పు చేసి నిర్మించుకున్న ఇళ్లను సుందరీకరణ పేరుతో ప్రభుత్వం కూల్చివేయడానికి సిద్ధపడటం దారుణం. పైసా పైసా కూడబెట్టుకుని అప్పులు చేసి గృహాలు నిర్మించుకున్నాం. అప్పుడు అభ్యంతరం చెప్పని ప్రభుత్వం ఇప్పుడు కూల్చివేస్తామనడం సరికాదు. మా ఇళ్లను వదిలేసి సుందరీకరణ పనులు చేపట్టుకోవచ్చు ఒకవేళ ప్రభుత్వం మొండి వైఖరితో ఇళ్లను కూల్చడానికి వస్తే ప్రాణ త్యాగానికైనా సిద్ధమవుతాం.

– నరసింహారెడ్డి, రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌ నివాసి

డబుల్‌ బెడ్రూమ్‌లు మాకు వద్దు..



రామంతాపూర్‌ మూసీ బఫర్‌జోన్‌లో ఇళ్లు కూల్చివేసి ఎక్కడో ఉన్న డబుల్‌ బెడ్రూమ్‌లు ఇస్తాననడం సరికాదు. మేము చేసే కూలీ పనులు చిన్న చిన్న ఉద్యోగాలు ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. వాటిని వదిలేసి ఎక్కడికో వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. అందుకే ప్రభుత్వం వెంటనే ఇళ్లను కూల్చకుండా మూసీ సుందరీకరణ పనులు చేపట్టుకోవచ్చు. ఒకవేళ మా ఇళ్లను కూల్చివేస్తే తీవ్రంగా అడ్డుకుంటాం.

– దుర్గాకుమారి, మూసీ బఫర్‌జోన్‌ నివాసి

స్కాలర్‌షిప్‌ బకాయిలు విడుదల చేయాలి


దర్నాలో పాల్గొన్న విద్యార్థులు

రామంతాపూర్‌: భారత ఐక్యవేదిక ఫెడరేషన్‌ హైదరాబాద్‌ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల స్కాలర్‌షిప్‌ రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల ఖాతాలో వేయాలని రామంతాపూర్‌లోని మెగా ఉమ్నె డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునావత్‌ కోటేష్‌, మణికంఠ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ముగిసి 9 నెలలు గడిచిందని, కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చినా విద్యార్థుల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ ఫీజు రీయింబర్స్‌మెంట్లు విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విద్యార్థి నేతలు రాజేష్‌నాయక్‌, రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి


ఎంపీ ఈటలకు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

ఘట్‌కేసర్‌: ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్‌ అయినా అవుషాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యామ పోస్టులను భర్తీ చేయించాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ కావేరి ఆధ్వర్యంలో ఎంపీ ఈటలకు గురువారం వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో సరిపోను ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారని, పాఠశాలలో వసతులు కల్పించాలని లేఖలో తెలిపారు. అలాగే కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అపరిశుభ్రత

గుడ్లలో పురుగులు.. విద్యార్థుల పరేషాన్‌

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌లోని అంబేడ్కర్‌నగర్‌ అంగన్‌వాడీ సెంటర్‌లో గుడ్లలో పురుగులు వచ్చాయి. అంగన్‌వాడీ సెంటర్‌లో ఉన్న గుడ్లలో పురుగులు రావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో నిల్వ ఉండి గుడ్లు పగిలిపోవడం వల్ల ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి గర్భిణులు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కోరారు.


గుడ్డు లోంచి వస్తున్న పురుగులు

మిశ్రమ చేపల పెంపకంపై క్షేత్రస్థాయి పరిశీలన

కీసర: రాజేందర్‌నగర్‌ ఐసీఎంలో జరుగుతున్న మత్స్యకారుల శిక్షణ కార్యక్రమానికి విచ్చేసిన కొత్తగూడెం, మేడ్చల్‌ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధులు గురువారం కీసర మండల పరిధిలోని భోగారం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మత్స్యకారులకు మిశ్రమ చేపల పెంపకం (కాంపోజిట్‌ ఫిష్‌ కల్చర్‌)పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 80 మంది మత్స్యకారులు పాల్గొన్నారు.


మిశ్రమ చేపల పెంపకం గురించి తెలుసుకుంటున్న మత్స్యకారులు

అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను జరపాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పోచారం: అన్నోజిగూడలోని రాజీవ్‌ గృహకల్ప కాలనీలో ఇళ్ల వెడల్పు పెంచేందుకు అడ్డుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను పక్కకు జరపాలని విద్యుత్‌ శాఖ ఏడీఈ స్వప్నకు సీపీఎం ఘట్‌కేసర్‌ మండల కమిటీ ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌ జరిపితే 32 కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. అందుకు విద్యుత్‌ శాఖ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సీపీఎం మండల కమిటీ కార్యదర్శి సబిత, నాయకులు యాదయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎదులాబాద్‌ స్కూల్‌ను సందర్శించిన ప్రత్యేక అధికారి



ఘట్‌కేసర్‌: ఎదులాబాద్‌ ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేక అధికారి సాంబశివరావు, మండల పరిషత్‌ అభివృద్ధి అధికారి గీతారెడ్డితో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వచ్ఛ త హీ సేవా–2024 విషయంపై ప్రతిజ్ఞ చేయించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

కీసర: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కీసర ఇన్‌స్పెక్టర్‌ వెంకటయ్య సమాచారం మేరకు... నాగారం నుంచి ముగ్గురు స్నేహితులు రామాయణ్‌దాస్‌, రామ్‌కుమార్‌, రూపేష్‌ కలిసి చీర్యాల చెరువులో చేపలు పట్టేందుకు బైక్‌పై వెళ్తున్నారు. చీర్యాల గ్రామ పరిధిలోని జగన్మోహన్‌రెడ్డి గార్డెన్‌ వద్ద మూలమలుపు తిరుగుతుండగా బైక్‌ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌ నడుపుతున్న రామాయణ్‌దాస్‌ డివైడర్‌కు అవతల వైపు పడ్డాడు. అదే సమయంలో కీసర నుంచి ఈసీఐఎల్‌ వైపు వెళ్తున్న లారీ వెనక టైర్స్‌ రామాయణ్‌దాస్‌కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలు తగిలాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుతన్నారు.

ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలి

మల్లాపూర్‌: ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని మేడ్చల్‌ జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.కృష్ణారెడ్డి అన్నారు. మేడ్చల్‌ మల్కాజ్‌గిరి జిల్లా స్త్రీ,శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాన్ని గురువారం నాచారం సాధన వృద్ధాశ్రమంలో వృద్ధులపై అవగాహన, సున్నితత్వ అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి వృద్ధులను గౌరవించడంతో పాటు సేవలను అందించడం, వారి పట్ల మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సీడీపీఓ అధికారి స్వాతి, యాదగిరి, సాధన సంస్థ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్‌ సురేఖరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.